ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
శనివారం 15 నవంబరు 2025



కార్తీకమాస పూజలు

జగిత్యాల టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోవిందుపల్లె నవదుర్గా క్షేత్రంలో కార్తీకమాస శుక్రవారాన్ని పురస్కరించుకొని నవదుర్గా సేవ సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మావారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావా వసంత సురేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ అర్బన్ మండల అధ్యక్షుడు తుమ్మ గంగాధర్, నీలి ప్రతాప్, నవ దుర్గా సేవన మితి సభ్యులు శ్రీనివాస్, అనుమల్ల చంద్రం పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజాగౌడ్

జగిత్యాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజాగౌడ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. సమస్యలు ఏమైనా ఎదురయితే ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకవెళ్లి పరిష్కరింపజేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి వాసం ప్రసాద్, సంబంధిత శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన



పెగడపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

పెగడపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను అదనపు కలెక్టర్ రాజాగౌడ్ శుక్రవారం సందర్శించి తనిఖీ చేశారు. లబ్ధిదారులు త్వరగా నిర్మించుకునేలా మండల అధికారులు దృష్టి సారించాలని సూచించారు. నిర్మాణ పనులు చేస్తున్న లబ్ధిదారులకు వెంటవెంటనే బిల్లులు జమ చేయాలని ఆదేశించారు. అనంతరం మోడల్‌స్కూల్‌ను సందర్శించి, విద్యాబోధ నను పరిశీలించడంతో పాటు వంటగది నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ రావు, ఎంపీవో శశికుమార్‌రెడ్డి, హౌజింగ్ ఏఈ జ్యోతి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, మాజీ మార్కెట్ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్ ఉన్నారు.

జూనియర్ కళాశాలల సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

రాయికల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు ప్రత్యేకాధికారి వుడిత్యాల రమణ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల బోధనా అభ్యసన, పాఠ్యాంశాల పునఃశ్చరణ-రివిజన్, అడ్మిషన్ల నమోదు, పరీక్ష ఫీజు చెల్లింపులు, ప్రాక్టికల్-ప్రయోగ పరీక్షలు, వార్షిక పరీక్షల నిర్వహణ, కళాశాల వసతుల పరికల్పన, సీసీ కెమెరాల పనితీరు, ప్రయోగశాలల ఏర్పాట్లు, కళాశాల భవన మరమ్మతు పనుల గురించి వివ రించారు. ప్రిన్సిపాల్ జిందం రాజేష్, ఉపన్యాసకులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ బాలికలు, బాలుర, ప్రైవేట్ కళాశాలలైన పీఆర్‌బీఎం, మాస్ట్రో, శ్రీచైతన్య కళశాలలను ఇంటర్ మీడియట్ బోర్డు డిప్యూటీ సెక్రెటరీ సుందర్ రాఘవ తనిఖీ చేసి మౌలిక వసతులపై ఆరా తీశారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గౌసుర్ రహమన్, పీఆర్‌బీఎం, మాస్ట్రో, శ్రీచైతన్య కళాశాల నిర్వహకులు పోత ని ప్రవీణ్‌కుమార్, ఆకుల రాజేష్, శేఖర్ పాల్గొన్నారు.

మల్లాపూర్: మల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇంటర్ బోర్డు అబ్జార్వర్ రమణారావు సందర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రాయికల్ పట్టణంలో గణాంక సర్వే

రాయికల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర గణాంక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ గణాంక శాఖ సర్వేను రాయికల్ పట్టణంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. వ్యవసాయేతర రంగంలోని చిన్నవ్యాపారాల ఆర్థిక పరిస్థితిని, వాటి పనితీరును తెలుసుకోవడానికి ఈ సర్వేను చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో గణాంక శాఖ అధికారులు గుర్రం శ్రీనివాస్ గౌడ్, ఆరె లక్ష్మీనారాయణ, మున్సిపల్ మేనేజర్ వెంకట్, వార్డు ఆఫీసర్ ఆడెపు అశ్విని, బిల్ కలెక్టర్ మందుల ప్రసాద్, మెప్మా ఆర్పీ రమ్య పాల్గొన్నారు.



జూనియర్ కళాశాలలపై ఫోకస్

- మూడు బృందాలతో ఇంటర్ కళాశాలల తనిఖీలు
- మౌలిక వసతులు, విద్యా బోధన, సిలబస్ తీరు పరిశీలన
- లెక్చరర్లు, విద్యార్థుల హాజరు తనిఖీ
- ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల్లో గుబులు
- జిల్లాలో 75 ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు

జగిత్యాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జూనియర్ కళాశాలపై ఇంటర్మీడియట్ బోర్డు ప్రత్యేక దృష్టి సారించింది. ప్రభుత్వ కళాశాలలను ఇప్పటికే ప్రక్షాళన చేయగా, క్షేత్రస్థాయిలో ఆచరణ, పరిస్థితులు అధ్యయనానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. దీంతో పాటు వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల్లో విద్యా బోధన, మౌలిక వసతులు తదితర అంశాలపై తనిఖీలు నిర్వహిస్తున్నారు. తనిఖీల వివరాలను రోజువారీగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. జీపీఎస్ ఆధారంగా తనిఖీలు చేపడుతుండడంతో కళాశాల యాజమాన్యాల్లో గుబులు పుడుతోంది. తనిఖీలతో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లోని వాస్తవ పరిస్థితులు ప్రభుత్వానికి స్పష్టంగా తెలిసే అవకాశం ఏర్పడింది.

దీంతో నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలకు ఉపక్రమించే అవకాశాలు ఉన్న ట్లు తెలుస్తోంది. జిల్లాలో ఇంటర్ విద్యాధికారి నారా యణ నేతృత్వంలో ఒక బృందం ఈనెల 11వ తేదీ నుంచి తనిఖీలు ప్రారంభించాయి. రాష్ట్ర స్థాయి అధికారులతో కూడిన మరో రెండు బృందాలు సైతం కళాశాలలను తనిఖీ చేయనున్నాయి. జిల్లాలో ప్రతీరోజూ రెండు నుంచి నాలుగు కళాశాలలను ఒక్కో బృందం తనిఖీ చేయాల్సి ఉంటుంది.

మూడు బృందాలుగా తనిఖీలు...

జిల్లాలో 75 జూనియర్ కళాశాలలున్నాయి. ఇందులో 16 ప్రభుత్వ కళాశాలలు, 19 ప్రైవేటు జూనియర్ కళాశాలలు, 40 కేజీబీవీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల కలాశాలలు, రెసిడెన్షియల్ కళాశాలలున్నాయి. వీటిని తనిఖీ చేసేందుకు ఇంటర్ బోర్డు మూడు బృందాలను ఏర్పాటు చేసింది. మొదటి బృందంలో డిస్ట్రిక్ట్ ఇంటర్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డీఐఈవో) బొప్పరాతి నారాయణ, మరో బృందంలో ప్రత్యేకాధికారి (ఇంటర్ బోర్డు డిప్యూటీ సెక్రెటరీ) రమణారావు, ఇంకో బృందంలో డిప్యూటీ సెక్రెటరీ రాఘవలతో తనిఖీలు చేపడుతున్నారు. తొలి విడతలో డీఐఈవో నేతృత్వంలోని బృందానికి 44 కళాశాలలు, మరో రెండు బృందాలకు 12 కళాశాలల చొప్పున 24 కళాశాలల్లో తనిఖీలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కాగా జిల్లాలో 75 కళాశాలలుండగా 68 కళాశాలకు మాత్ర మే షెడ్యూల్ వారీగా తనిఖీలకు కేటాయింపులు జరిపారు. ఏడు కళాశాలలకు షెడ్యూల్ కేటాయింపులో ఇంటర్ బోర్డు నిర్లక్ష్యం చూపింది. అయితే దానిని సరిదిద్దుకోవడానికి మిగిలిన ఏడు కళాశాలలను సైతం డీఐఈవో బృందంతో తనిఖీలు చేయిచండానికి నిర్ణయించినట్లు సంబంధిత వర్గాలు అంటున్నాయి.

కళాశాల పేరు..కోడ్..

కళాశాల పేరు, కళాశాల కోడ్, తనిఖీ చేసిన సమయం, తేదీ, కళాశాల గుర్తింపు వివరాలు, అకాడమిక్ యాక్టివిటీస్..

(మిగతా 8లో..)



మేడిపల్లి గురుకుల కళాశాలలోని రికార్డులను తనిఖీ చేస్తున్న డీఐఈవో నారాయణ

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇబ్రహీంపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీధర్ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కొడిమ్యాల: మండలంలోని తిర్మలాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 6గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు శుక్రవారం విద్యుత్ శాఖ ఏఈ ఆర్. రఘునాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. తిర్మలాపూర్, సండ్రల్లపల్లి, దమ్మయ్యపేట, కోనాపూర్, పోతారం, సూరంపేట, గంగారాం తండా, హిమ్మతురావుపేట, శనివారంపేట, రాంసాగర్, డబ్బుతిమ్మయ్యపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహక రించాలని ఏఈ కోరారు.

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండల పరిధిలోని కల్లెడ, లక్ష్మీపూర్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేస్తున్నట్లు ఏఈ సుందర్ తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ పరిధిలోని తక్కళ్లపల్లి, సోమన్‌పల్లి, సంగంపల్లి, హబ్సీపూర్, గుల్రాజ్‌పల్లి, అనంతారం, లక్ష్మీపూర్, జాబితాపూర్ గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేస్తామని వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

దివ్యాంగుల రుణాలకు ఇంటర్వ్యూలు

పెగడపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం దివ్యాంగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను పెగడపల్లి మండలానికి కేటాయించిన ఈఆర్ఎస్ లోన్స్ రెండు యూనిట్లకుగాను 12 మంది దరఖాస్తు చేసుకోగా దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రేమ్‌సాగర్‌రావు, ఐసీడీఎస్ సీడీపీవో వీరలక్ష్మి, ఏపీఎం రవివర్మ, సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుభద్ర, తిరుపతి పాల్గొన్నారు.

కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

- కలెక్టర్ సత్యప్రసాద్

మెట్‌పల్లి రూరల్/ఇబ్రహీంపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి, మిల్లులకు తరలించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మెట్‌పల్లి మండలంలోని ఆత్మనగర్, ఆత్మకూరు, జగ్గసాగర్ గ్రామాల్లో, ఇబ్రహీంపట్నం మండలంలోని అమ్మకపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తేమ వచ్చిన ధాన్యాన్ని వెంటనే కాంటా వేసి, రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. కొనుగోలు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, రైతులకు 48 గంటల్లోగా చెల్లింపులు జరిగేలా చూడాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన టార్పాలిన్, తూకం యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచాలన్నారు. మిల్లుల వద్ద లారీలను పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు దించుకొని, లోడింగ్ సమస్యలు లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. గ్రేడ్ ఏ ధాన్యానికి రూ.2,389, కాగా బి గ్రేడ్‌కు రూ.2369 మద్దతు ధర మీద కొనుగోలు చేయాలని సూచించారు. రైతులను డబ్బులు ఎవరూ అడిగినా ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. అధికారులు కొనుగోలు కేంద్రాలను సందర్శించి, రైతుల ఇబ్బందులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయనవెంట మెట్‌పల్లి ఆర్డీఓ శ్రీనివాస్, డీఆర్డీవో రఘువరన్, తహసీల్దార్ నీత, ఆర్ఐ ఉమేష్, కాంతయ్య, సీఈవో తిరుపతి, ఏవో దీపిక, ఏపీఎం అశోక్, సీసీలు అశోక్, సూరయ్య, కేంద్ర నిర్వహకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు కొనుగోలు కేంద్రంలో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ సత్యప్రసాద్

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

బుగ్గారం నవంబర్ 14((ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరారు. ఈ మేరకు మండలంలోని సిరికొండ, వెలుగొండ, బుగ్గారం, సిరివంచ కోట గ్రామాల్లో స్థానిక నాయకులతో కలిసి ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో సిబ్బంది రైతుల నుంచి ఎటువంటి కట్టింగ్ లేకుండా కొనాలని ఎటువంటి సమస్యలు ఎదురైన తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో ముత్యాల పోచమ్మ నల్ల పోచమ్మ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లత, సివిల్ సప్లయర్ జితేందర్‌రెడ్డి, తహసీల్దార్ భూమేశ్వర్, ఎంపీడీవో సుమంత్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుముల లావణ్య, మండల వ్యవసాయ అధికారి అక్షిత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల సుభాష్, మండల ఉపాధ్యక్షుడు నగునూరి నర్సాగౌడ్, పీఏసీఎస్ సీఈవో రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి బాలలే .. రేపటి పౌరులు

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా బాలల దినోత్సవం

వెల్గటూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నేటి బాలలే రేపటి పౌరులు అనిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం బాలల దినోత్సవం సందర్భంగా మండలం లోని పైడిపల్లి ప్రాథమిక పాఠశాల చిన్నారులతో కలిసి సరదాగా ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు శ్రద్ధగా వినడం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్ర మంలో ప్రధానోపాధ్యాయుడు తులసి ఆగమయ్య, ఉపాధ్యాయులు సతీష్‌కుమార్, సునీత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేంధర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గోల్ల తిరుపతి, పూదరి రమేష్, కూన సంతోష్, గాలి హరీష్ పాల్గొన్నారు.

పెగడపల్లి: పెగడపల్లి మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తమ తోటి విద్యార్థులకే పాఠాలు బోధించి బాలల దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. ఆయా కార్యక్రమాలలో మండల విద్యాధికారి సులోచనాదేవి, ప్రధానోపాధ్యాయులు లలిత, ఉపాధ్యాయులు లచ్చయ్య, మాధవి, శంకరయ్య, శ్రవణ్ పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు ఉన్నారు.

మెట్‌పల్లి టౌన్: మెట్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కాంగ్రెస్ నాయకులు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, పండ్లు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం, మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు నాయిని సురేష్, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు. మెట్‌పల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శివాజీనగర్‌లోని ఎంపీపీఎస్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు అందించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వేల్పుల శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు. మెట్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో వంజర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మల శంకర్ విద్యార్థులకు బుక్కులు పంపిణీ చేశారు.

కొడిమ్యాల: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవంలో బాగంగా ఒకరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

మల్యాల: మల్యాలలోని శ్రీవాగ్దేవి విద్యాసంస్థలు, ఎస్‌జీఆర్, సాయిశ్రీ, మల్యాల క్రాస్ రోడ్డు వద్ద గల లాస్య, రామన్నపేటలోని శ్రీసరస్వతి స్కూల్‌లో వివిధ వేశాధరణాలు, ప్రదర్శనలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి వేడుకలు జరుపుకున్నారు.

జగిత్యాల టౌన్: జగిత్యాల పట్టణంలోని శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్లో చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జ్యోతి, ఫిరోజ్, జానకి రామ్, కిరణ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో గల ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో, టీఆర్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో వేడుకలను నిర్వహించారు.

గొల్లపల్లి: గొల్లపల్లి మం డలంలోని ప్రభుత్వ ప్రైవేట్ విద్య సంస్థలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణలతో అలరించారు. భారత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్, ప్రగతి ఉన్నత పాఠశాల, విశ్వశాంతి హైస్కూల్, పట్టణంలోని 2, 8, 9 10 అంగన్‌వాడీ కేంద్రాల్లో, మండలంలోని మైతాపూర్ ప్రభుత్వ పాఠశాల, కిష్టంపేట, ఇటిక్యాల అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులు ఉపాధ్యాయులుగా అవతారమెత్తి విద్యాబోధన చేశారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

భీమారం: మండల కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్‌లో జరిగిన వేడుకల్లో ప్రిన్సిపాల్ పల్లికొండ గణేష్ విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు.



పైడిపల్లిలో చిన్నారులతో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ధర్మపురి: ధర్మపురి మండలంలోని దోనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన వేడుకల్లో మండల విద్యాధికారి ఎస్ సీతాలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నీలిమ పాల్గొన్నారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో జరిగిన వేడుకల్లో పాఠశాలల హెచ్‌ఎంలు కొలిచాల శ్రీనివాస్, పెండ్యాల మహేందర్, జ్యోతి, ఎదుల మహేష్, దాసరి భీమయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని కేరళ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పాఠశాల వారోత్సవం పురస్కరించుకోని బాలల దినోత్సవంను నిర్వహించారు. పట్టణంలోని నెహ్రూ చౌరస్తాలో గల ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

వెల్గటూర్: మండలంలోని పాశిగామ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నీలం సంపత్, ఉపాధ్యాయుడు మహేష్, విద్యార్థుల తల్లిదండ్రులు అనూష, మమత, దివ్య, సౌమ్య, లాస్య, శిరీష పాల్గొన్నారు.





పెగడపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థి ఉపాధ్యాయులు, తాండ్రియాలలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అంగన్‌వాడీ టీచర్, కొడిమ్యాలలో బాలల దినోత్సవంలో పాల్గొన్న చిన్నారులు

'స్వర స్నేహం' కమిటీ సమావేశానికి ఆహ్వానం

జగిత్యాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈనెల 16వ తేదీన నిర్వహించనున్న స్వర స్నేహం కమిటీ సమావేశానికి హాజరు కావాలని కోరుతూ అదనపు కలెక్టర్ బీఎస్ లతకు కమిటీ అధ్యక్షురాలు రచన, నాయకులు సింగం పద్మ, శ్రీలత, భాను ప్రియ, శ్రీలక్ష్మీ ఆహ్వానపత్రం అందించారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం అదనపు కలెక్టర్ బీఎస్ లతను కలిసి ఆహ్వానం తెలిపారు.

బీజేపీ నాయకుల సంబరాలు

మల్యాల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బిహార్‌లో ఎన్డీఏ విజయం సాధించడంతో మల్యాలలో బీజేపీ నాయకులు విజయోత్సవాలు నిర్వహించారు. మల్లేశం, ప్రసాద్, మల్లేశంయాదవ్, లత, రమ, సాయికుమార్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, గౌతం, డిండిగాల దేవయ్య, గంగారాం, కిషన్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కోరుట్ల: కోరుట్ల బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం బిహార్ ఎన్నికల ఫలితాలపై హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు జరిపారు. పట్టణంలోని కార్గిల్ చౌరస్తాలో టపాసులను పెల్చి మిఠాయిలు పంపిణీ చేసి వేడుకలను జరిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



లారీని ఢీకొన్న కారు

మానకొండూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లోని స్థానిక రైస్‌మిల్లుల వద్ద శుక్రవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా నవదంపతులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానిక సీఐ సంజీవ్ వివరాల ప్రకారం.. వీణవంక మండలంలోని కొండపాకకు చెందిన కోట సాయిచరణ్ బంధువుల వివాహం చల్లూరు గ్రామంలో గురువారం జరిగింది. ఈ వివాహానికి హాజరైన నవదంపతులను కారులో తీసుకొని శుక్రవారం తెల్లవారు జామున కరీంనగర్‌కు బయలుదేరారు. మానకొండూర్ రైసుమిల్లుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డుపై ఆగి ఉన్న లారీని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారును నడుపుతున్న సాయిచరణ్‌తోపాటు రిషికేష్‌కు తీవ్రగాయాలవగా నవదంపతులకు స్వల్ప గాయాలయ్యాయి. నలుగురిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. సాయిచరణ్ తండ్రి నర్సింహరెడ్డి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రెండు బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలు

చందుర్తి నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని మర్రిగడ్డలో మూలమలుపు వద్ద శుక్రవారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. కిష్టంపేట గ్రామానికి చెందిన చిగుర్ల ఎల్లయ్య, భూమండ్ల కొమురయ్య అనే ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వేములవాడ నుంచి కిష్టంపేటకు వెళుతుండగా మార్గమధ్యలోని మర్రిగడ్డ గ్రామ శివారులో ననుగులకు చెందిన బాలురు బైక్‌పై ఎదురుగా వచ్చి ఢీకొట్టారు. ఈ సంఘటనలో ఎల్లయ్య, కొమురయ్యలకు కాలు విరగడంతోపాటు తీవ్రగాయాలు కాగా, చికిత్స నిమిత్తం వేములవాడలోని ఆసుపత్రికి తరలించారు.

- ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులకు సకాలంలో అందని జీతాలు
- సర్కారు స్పందించాలని వేడుకోలు



వేతన వేతలు

జగిత్యాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల(ఓపీఎస్)కు వేతనాలు సకాలంలో అందడం లేదు. వేతనాలు సకాలంలో అందకపోవడంతో అవస్థలు పడుతున్నారు. అసలే చాలీచాలని వేతనంతో మారుమూల గ్రామాలకు వెళ్లి పనిచేస్తున్న చిరుద్యోగులు సమయానికి జీతాలు రాక అనేక ఇబ్బందుల పాలవుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,038 మంది ఓపీఎస్‌లు పనిచేస్తుండగా, జగిత్యాల జిల్లాలో 28 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి పలు జిల్లాల్లో ఈ యేడాది ఏప్రిల్ నుంచి వేతనాలు అందడం లేదు. జగిత్యాల జిల్లాలో ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలలకు చెందిన వేతనాలు అందలేదని వాపోతున్నారు.

● నాలుగేళ్ల క్రితం నియామకం..

ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు నాలుగు సంవత్సరాల క్రితం ప్రభుత్వం నిర్వహించిన రాత పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉద్యోగాలు సాధించారు. వీరిలో చాలా మంది ఉన్నత చదువులు చదువుకున్నారు. ఎప్పటికైనా జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా అవకాశం లభిస్తుందన్న ఆశతో చాలీచాలని వేతనాలతో ఓపీఎస్‌లుగా పనిచేస్తున్నారు. గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులు చేసే పనులతో సమానంగా పంచాయతీల్లో ఓపీఎస్‌లు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఓపీఎస్‌లకు నెలకు రూ.19,500 వేతనంగా ప్రభుత్వం చెల్లిస్తోంది. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా వీరికి వేతనాలు ఇస్తున్నారు. ఈ ఏజెన్సీలు వీరి ఖాతాల్లో వేతనాలు జమ చేయాల్సి ఉంటుంది. వీరి ఖాతాల్లో కేవలం రూ.15 వేలు మాత్రమే జమ చేస్తున్నారని, మిగిలిన వేతనంలో ఎందుకు కోత విధిస్తున్నారో ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ నిర్వాహకులు చెప్పడం లేదని చిరుద్యోగులు వాపోతున్నారు. ఓపీఎస్‌లందరికి క్రమబద్ధీకరణ చేయాలని కోరుతున్నారు.

● భారంగా కుటుంబ పోషణ..

సక్రమంగా వేతనాలు రాకపోవడంతో ఓపీఎస్‌లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేతిలో పైసలు లేకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. ఇంటి అద్దెలు, ఈఎంఐలు, పిల్లల చదువులకు ఫీజులు, నిత్యావసరాలకు తిప్పలు తప్పడం లేదు. వేతనాలు సకాలంలో రాకపోవడంతో ఒక్కొక్కరికి రూ.లక్షపైనే బకాయిలున్నాయి. చాలీచాలని వేతనాలు అందితేనే కుటుంబాలను కష్టంగా వెళ్లదీసే కాలంలో అసలు వేతనాలు రాకపోవడంతో ఎలా కుటుంబాలను నెట్టుకురావాలని ఓపీఎస్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలో వేతనాలు అందించాలి

-సిద్దం సతీష్, ఓపీఎస్ అసోసియేషన్ నాయకుడు, జగిత్యాల



గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులకు ప్రతీ నెల వేతనాలు చెల్లించాలి. అసలే చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నాము. ఎప్పటికప్పుడు అందకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాం.

ఓపీఎస్‌ల సమస్యలను పరిష్కరించాలి

-కె.సందీప్ రెడ్డి, ఓపీఎస్ అసోసియేషన్ నాయకుడు, జగిత్యాల



రాష్ట్రంలో ఓపీఎస్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. వేతనాలు సకాలంలో చెల్లించాలి. ఓపీఎస్‌లందరినీ రెగ్యులరైజ్ చేయాలి. క్రమబద్ధీకరణ చేస్తూ సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్ వర్తింపజేయాలి. వేతనాల్లో ఎలాంటి కోతలు లేకుండా ఏజెన్సీలు చెల్లించాలి.

అల్మాస్‌పూర్‌లో దొంగల బీభత్సం

- తాళం వేసి ఉన్న ఐదు ఇళ్లలో చోరీ
- నగదు, బంగారు, వెండి ఆభరణాల అపహరణ

ఎల్లారెడ్డిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌లో గురువారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసి ఉన్న ఐదు ఇళ్లలో చొరబడ్డారు. నగదు, బంగారు, వెండి ఆభరణాలను అపహరించుకుపోయారు. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని దేవరాజు, రాజు, భూ లక్ష్మీ, లచ్చయ్యతోపాటు మరోవ్యక్తి తమ ఇళ్లకు తాళాలు వేసి బంధువుల వద్దకు వెళ్లారు. గుర్తుతెలియని వ్యక్తులు వేసిన ఇళ్ల తాళాలు పగుల కొట్టి లోనికి ప్రవేశించారు. ఇళ్లలోని బీరువాలను ధ్వంసం చేశారు. వస్తువులను చిందరవందరగా పడేశారు. సుమారు రూ.లక్షన గదు, రూ.2.5లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాలకు చేరుకుని పరిశీలించారు. జాగిలం, వేలిముద్రల నిపుణులు చేరుకుని నమూనాలను సేకరించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

రూ.7200 పలికిన పత్తి ధర

జమ్మికుంట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.7200 పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు 68మంది రైతులు 589 క్వింటాళ్ల విడి పత్తి, ఎనిమిది మంది రైతులు 14 క్వింటాళ్ల గోనెసంచుల్లో విక్రయానికి తీసుకొచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7200, కనిష్ఠ ధర రూ.6200 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఫీజు చెల్లించినా.. హాల్ టికెట్ రాలేదు..

● న్యాయం చేయాలని విద్యార్థి సంఘాల డిమాండ్



కళాశాల వద్ద విద్యార్థుల ఆందోళన

వేములవాడ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సకాలంలో ఫీజు చెల్లించినప్పటికీ కాలేజీ నిర్వాహకుల నిర్లక్ష్యంతో హాల్‌టికెట్ రాకపోవడంతో రాజరాజేశ్వర సంస్కృత కళాశాల విద్యార్థి సాయిచంద్రిక పరీక్షరాసే అవకాశం కోల్పోయింది. ఈ విషయాన్ని తెలుసుకున్న విద్యార్థి సంఘాలు ఆమెకు అండగా నిలిచాయి. దీంతో విద్యార్థినికి మళ్లీ పరీక్ష రాసే అవకాశం దక్కింది. శుక్రవారం చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వేములవాడ సంస్కృత కళాశాలలో బీఏఎల్ రెండో సంవత్సరం చదువుతున్న సాయిచంద్రిక సెమిస్టర్ పరీక్షలకోసం ఫీజు చెల్లించినప్పటికీ హాల్ టికెట్ రాలేదు. దీంతో మొదటిరోజు నిర్వహించిన రూరల్ డెవలప్‌మెంట్ సబ్జెక్ట్ పరీక్షకు ఆమెను అనుమతించలేదు. పరీక్షరాసే అవకాశం ఇవ్వకపోవడంతో ఆందోళనకు లోనైన ఆమె ఆసుపత్రి పాలైంది. ఈ విషయం తెలుసుకున్న బీసీ విద్యార్థి సంఘం నాయకుడు సాయి తదితరులు కళాశాల అధ్యాపకులను నిలదీశారు. సకాలంలో ఫీజు చెల్లించినప్పటికీ సిబ్బందిచేసిన పొరపాటు కారణంగానే హాల్‌టికెట్ రాలేదని ఆరోపించారు. ఈ అంశంపై కళాశాల ప్రిన్సిపాల్ మల్లారెడ్డిని వివరణ కోరగా తప్పుగా నమోదుకావడం వల్ల ఈపొరపాటు జరిగిందని తెలిపారు. వెంటనే ఉన్నతాధికారులను కలిసి ఈ విషయాన్ని వివరించడంతో హాల్‌టికెట్ జారీచేశారని, తదుపరిపరీక్షకు సాయిచంద్రిక హాజరుకావచ్చని తెలిపారు. సాంకేతిక కారణాలవల్ల తప్పుజరిగిందని, రాయలేకపోయిన మొదటి పరీక్షను తర్వాత నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 57మందికి జరిమానా



సిరిసిల్ల: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

సిరిసిల్ల రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుశిక్షతోపాటు జరిమానాలు తప్పవని సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ అన్నారు. సిరిసిల్ల పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో తనిఖీలు చేపట్టామని, మద్యం తాగి వాహనాలు నడిపిన 57మందిని శుక్రవారం సిరిసిల్ల కోర్టులో ప్రవేశపెట్టగా వారికి జరిమానాలు విధిస్తూ మేజిస్ట్రేట్ జయశ్రీ తీర్పు వెల్లడించినట్లు సీఐ తెలిపారు. వీరికి పోలీస్ స్టేషన్‌లో పోలీసులు ప్రతిజ్ఞ చేయించి కౌన్సె లింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడి పిన ఇద్దరికి రూ.6వేలచొప్పున, 12మందికి రూ.5 వేల చొప్పున, ఒక్కరికి రూ.4వేల చొప్పున, 42 మందికి రూ.వెయ్యి చొప్పున జరి మానాలను విధించారన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐ దిలీప్, పోలీసులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేటలో 37మందికి..

ఎల్లారెడ్డిపేట: మద్యం తాగి పట్టుబడిన పలువురు వాహనదారులకు జిల్లా రెండోతరగతి జ్యుడీషియల్ న్యాయమూర్తి జయశ్రీ జరిమానా విధించారని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఇటీవల తనిఖీలు నిర్వహించగా 37మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నారని గుర్తించామని తెలిపారు. పరీక్షల అనంతరంనివేదిక ఆధారంగా న్యాయస్థానంలో హాజరు పరిచామని చెప్పారు. 37మందికి మొత్తం 59వేల జరిమానా విధించారని పేర్కొన్నారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

జగిత్యాలరూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం కల్లెడ శివారులో గుర్తుతెలియని కారు ఢీకొట్టడంతో కట్ట రాజేందర్, బత్తుల సుమన్ అనే వ్యక్తులను గాయాలైనట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మల్యాల మండలం మద్దుట్లకు చెందిన సుమన్, రాజేందర్ ధర్మపురి నుంచి జగిత్యాల వైపు ద్విచక్రవాహనంపై వస్తున్నారు. ఈ క్రమంలో కల్లెడ వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో రాజేందర్ కుడిచేతికి, సుమన్‌కు కుడికాలికి గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

కోతి దాడిలో వృద్ధురాలికి గాయాలు

కోనరావుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం కనగర్తి గ్రామానికిచెందిన బంగారు ముత్తవ్వ కోతి దాడిలో గాయపడింది. గ్రామానికి చెందిన ముత్తవ్వ పనిమీద ఊరిలోకి వచ్చి ఇంటికి వెళుతున్న క్రమంలో ఆకస్మాత్తుగా వానరం దాడి చేసి గాయపరిచింది. చికిత్స నిమిత్తం కోనరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు.

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ యోగా పోటీలకు ఏర్పాట్లు పూర్తి

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాలోని రామడుగు మండలం వెలిచాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నుంచి 17 తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ యోగా పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అండర్-14, అండర్-17 బాలికలు, బాలురుకు యోగా చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరామ్ మొండయ్య, భాషా బోయిన వేణుగోపాల్ తెలిపారు. తెలంగాణలోని పది ఉమ్మడి జిల్లాల నుంచి 240 మంది క్రీడాకారులు, 60 మంది అధికారులు, 30మంది క్రీడా నిర్వాహకులు పాల్గొంటారని తెలిపారు. వెలిచాల గ్రామపంచాయతీ కమ్యూనిటీ హాలులో బాలికలకు, జడ్పీఉన్నత పాఠశాలలో బాలురకు వసతి కల్పించినట్లు చెప్పారు. క్రీడాకారులందరికీ స్థానిక నాయకుడు వీర్ల హన్మంతరావు యూత్ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభకనబరిచిన క్రీడాకారులు త్వరలో కలకత్తాలో నిర్వహించే అండర్-14 కేటగిరి, త్రిపురలోని అగర్తలో అండర్-17 కేటగిరిలో నిర్వహించే జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని రాజరాజేశ్వరి, నిర్వాహకులు ఫిజికల్ డైరెక్టర్ దత్తాత్రేశర్మ, క్రీడల ఎస్‌జీఎఫ్ సహాయకులు, నిర్వాహణ బాధ్యులు మల్లేశం, నగేష్, మహిపాల్‌రెడ్డి, మహేందర్, పద్మలతాదేవి, సుజాత, పుష్పలత, హలీముద్దీన్‌షేక్, యాకుబ్ అలీ, వెలిచాల యువసేన సభ్యులు పాల్గొన్నారు.



మైదానాన్ని సిద్ధం చేయిస్తున్న నిర్వాహకులు

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలో మల్యాల విద్యార్థినికి ప్రథమ స్థానం



కీర్తనను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చందుర్తి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): టీ-సాట్, రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం సంయుక్తంగా టీ-సాట్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన రాష్ట్రస్థాయి క్విజ్‌పోటీలో రాజన్నజోన్ జట్టు మొదటి స్థానంలో నిలిచింది. చందుర్తి మండలం మల్యాల ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న పులికీర్తన రాజన్న జోన్‌జట్టుకు ప్రాతినిధ్యం వహించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా మెమెంటో, ప్రశంసాపత్రం అందుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ సందర్భంగా కీర్తనను చందుర్తి మండల విద్యాధికారి వినయ్ కుమార్, మల్యాల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శరత్‌చంద్ర, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు పీసరి మంజుల, స్వామి వివేకానంద సేవాసమితిసభ్యులు,గ్రామస్థులు అభినందించారు.

రేకుల షెడ్డు దగ్ధం

జగిత్యాలరూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బురవేని సమత రేకుల షెడ్డులో శుక్రవారం షార్ట్ సర్క్యూట్ చోటుచేసుకుంది. దీంతో ఫ్రిడ్జ్, కూలర్‌తో పాటుగా మంచాలు, బట్టలు రూ. లక్ష విలువ గల500 నోటు కట్టలు దగ్ధమైనట్లు జగిత్యాల రూరల్ ఎస్.ఐ సధాకర్ తెలిపారు. బాధితురాలు సమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

వరకట్నం వేధింపులతో గర్భిణి ఆత్మహత్య



సుప్రియ(ఫైల్)

రామగిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని కల్వచర్ల పంచాయతీ పరిధి కుర్మపల్లిలో వరకట్న వేధింపులు తాళలేక గర్భిణి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. ముత్తారం మండలం పోతారం గ్రామానికి చెందిన వోడ్నాల రాజేశం కూతురు మనుశ్రీ అలియాస్ సుప్రియ(26)ను కుర్మపల్లికి చెందిన వేముల నతీష్‌కు ఇచ్చి 2023లో వివాహం చేశారు. వివాహ సమయంలో కట్నం కింద 13 తులాల బంగారం, రూ. రెండు లక్షల విలువ గల గృహోపకరణాలు అందజేశారు. సంవత్సరం పాటు సజావుగా సాగిన వీరి దాంపత్య జీవితంలో సుప్రియకు కుమారుడు పుట్టాడు. అనంతరం భర్త సతీష్, అత్త భూలక్ష్మి, మామ చంద్ర య్య అదనపు వరకట్నం కోసం వేధింపులకు గురిచేశారు. ఈ విషయం సుప్రియ తండ్రి రాజేశంకు తెలుపగా యేడాది క్రితం పోతారంలో పంచాయితీ పెట్టారు. పెద్ద మనుషుల సమక్షంలో సతీష్ భార్యను మంచిగా చుసుకుంటానని ఇంటికి తీసుకుని వెళ్ళాడు. అనంతరం సుప్రియ గర్బం దాల్చింది. ఏడునెలల గర్భిణి అని చూడకుండా వేధింపులకు గురిచేశారు. గురువారం రాత్రి మద్యం సేవించి వచ్చిన సతీష్ భార్య గర్భిణి అని చూడకుండా తీవ్రంగా కొట్టినట్లు స్థానికుల ద్వారా తెలిసింది. దీంతో మనస్తాపానికి గురైన సుప్రియ ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కూతురు ఉరివేసుకొని మృతి చెందినట్లు బంధువుల ద్వారా అందిన సమాచారం మేరకు తల్లి దండ్రులు వెళ్ళిచూడగా బెడ్‌రూంలో సుప్రియ చేతుల గాజులు పగిలి, ఎడమచేతికి గాయాలతో ఉన్నట్లు తండ్రి రాజేశం తెలిపారు. భర్త, మామ, అత్తలు కలిసి అదనపు వరకట్నం కోసం వేధింపులకు గురిచేశారని ఆరోపించారు. వరకట్నవేధింపులతో ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఘటన స్థలాన్ని గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్‌లు పరిశీలించారు. కాగా అత్త, మామ పరారీ ఉండగా భర్త సతీష్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లిగారిల్లు అయిన పోతారంలో అంత్యక్రియలు నిర్వహించారు.

అదనపు కట్నం కోసం.. భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

● రూ. 10 వేల జరిమానా

జగిత్యాల టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భార్యను వేధింపులకు గురిచేసి హత్య చేసి, సాక్ష్యాలను తారుమారు చేసిన కేసులో నిందితుడుకి జీవిత ఖైదు శిక్షతో పాటు రూ. 10 వేల జరిమానా విధిస్తూ ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్, సెషన్ జడ్జ్ నారాయణ శుక్రవారం తీర్పు చెప్పారు. మెట్‌పల్లి బోయవాడకు చెందిన నిందితుడు వాల్గోట్ కిషోర్ 2021 డిసెంబరు 28న తన భార్య నిషితను తన ఇంట్లోనే గొంతు నులిమి చంపి, ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని తప్పుడు కథనాలు చెప్పి సాక్ష్యాలను దాచడానికి ప్రయత్నించాడు. ఈఘటనపై మృతురాలి తండ్రి కాశబోయిన పెద్దపోచయ్య ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ ఎన్ సదాకర్ కేసు నమోదు చేయగా అప్పటి డీఎస్పీ వి రవీంద్రరెడ్డి కేసు దర్యాప్తు చేసి సాక్ష్యాలను సేకరించారు. సాక్ష్యాల ఆధారంగా పీపీ వాదనలు వినిపించగా నిందితుడికి జీవిత ఖైదు శిక్షతో పాటు రూ. 10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ సందర్భంగా నిందితుడికి శిక్షపడేందుకు కృషిచేసిన డీఎస్పీ రవీంద్రరెడ్డి, ఎస్సై సదాకర్, పిపి మల్లేశం, కోర్టు కానిస్టేబుల్ టి రజిత, సియంఎస్ ఎస్సై శ్రీకాంత్, పిసిలు రాజు నాయక్, కిరణ్‌ను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

గంజాయి పట్టివేత

కరీంనగర్ క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గుంటూరుపల్లి వద్ద శుక్రవారం నిర్వహించిన పోలీసుల తనిఖీల్లో 260గ్రాముల గంజాయి పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. గుంటూరుపల్లి వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ద్విచక్రవాహనంపై ముగ్గురుయువకులను పట్టుకున్నామని, వాహనం తనిఖీ చేయగా గంజాయి లభించిందని సీఐ తెలిపారు. దుర్షేడ్‌కు చెందిన నేరెళ్ల చరణ్, గోపాల్‌పూర్‌కు చెందిన బెజ్జంకి లోకేష్, మరోబాలుడిపై కేసునమోదు చేశామని తెలిపారు. గంజాయితోపాటు కొంతనగదును, బైక్‌నుస్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సైలక్ష్మారెడ్డి, కానిస్టేబుళ్ల, మహిళా సిబ్బందిని రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్ అభి నందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● మరొకరి పరిస్థితి విషమం

శంకరపట్నం నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం శివారులో నేషనల్ హైవేబైపాస్ రోడ్డులో ఆగిఉన్న టిప్పర్‌ను బైక్‌ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా మరొకరి పరిస్థితి విషమంగా మారింది. స్థానికుల వివరాలప్రకారం.. శంకరపట్నం మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికిచెందిన వెంగళ ప్రవీణ్, శ్రీనివాస్ ద్విచక్రవాహనంపై కేశవపట్నం నుంచి బైపాస్ రోడ్డు మీదుగా ఇప్పలపల్లికి వెళ్తున్నారు. కేశవపట్నం శివారులో ఆగి ఉన్న టిప్పర్‌ను వీరి బైక్ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వెంగళప్రవీణ్(35) అక్కడికక్కడే మృతిచెందగా శ్రీనివాస్ పరిస్థితివిషమంగా ఉండడంతో ఆసుపత్రికి తరలించారు. ప్రవీణ్‌కు ఇద్దరు కుమారులు భార్య ఉన్నారు. ఎస్సై శేఖర్‌రెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించారు.

గంజాయి కేసులో ముగ్గురికి ఏడు సంవత్సరాల జైలు శిక్ష

● రూ.10వేల జరిమానా

జగిత్యాల టౌన్ నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గంజాయిసాగుతో పాటు గంజాయిని ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తూ విక్రయాలు చేస్తున్న ముగ్గురు నిందితులకు ఏడు సంవత్సరాల జైల్‌శిక్షతోపాటు రూ. 10 వేల జరిమానా విధిస్తూ ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్, సెషన్ జడ్జి నారాయణ శుక్రవారం తీర్పు వెలువరించారు. గతేడాది జగిత్యాల పట్టణ పోలీసులు కొత్త బస్టాండ్ సమీపంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో ఓ షాపింగ్‌మాల్ వద్ద అనుమానస్పదంగా సంచరిస్తున్న మేకల రాజు అలియాస్ కిన్నరి, జగిత్యాల పట్టణానికి చెందిన ఆరుముళ్ల సాయికుమార్, ఆసిఫాబాద్‌కు చెందిన మడవి చందు అనే ముగ్గురు వ్యక్తులను పోలీసులు గుర్తించారు. పోలీసులను చూసి పారిపోతున్న క్రమంలో పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద సోదాలు చేయగా గంజాయి లభ్యం కాగా ముగ్గురిపై కేసు నమోదు చేశారు. వీరు గోదావరి నది అవతల ఉన్న ఊట్నూర్ ప్రాంతంలో మడవి చందు అనే వ్యక్తి వద్ద తక్కువ ధరకు 250 గ్రాముల గంజాయి కొనుగోలు చేసుకుని జగిత్యాలలో విక్రయించేందుకు వచ్చిన క్రమంలో పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో పోలీసులు వారిని రిమాండ్‌కు తరలించారు. విచారణ జరిపిన న్యాయస్థానం నేర నిరూపణ కావడంతో నిందితులకు ఏడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధించింది. కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన టౌన్‌ఇన్‌స్పెక్టర్ కిషోర్, పీపీ కె మల్లేశ్‌గౌడ్, సీఎంఎస్ ఎస్సై ఎస్ శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుళ్లు మహేందర్, శ్రీనివాస్, సీఎంఎస్ కానిస్టేబుళ్లు రాజు నాయక్, కిరణ్ కుమార్‌ను ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

ద్విచక్ర వాహనం చోరీ

హుజూరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మెడికల్‌షాపు ఎదుట పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనం చోరీకి గురైన సంఘటన శుక్రవారం హుజూరాబాద్‌లో చోటు చేసుకుంది. హుజూరాబాద్ మండలంలోని పెద్దపాపయ్యపల్లికి చెందిన నర్సయ్య తన టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని పట్టణంలోని సంజీవని మెడికల్‌షాపు ఎదుట నిలిపి మందుల కొనుగోలుకు వెళ్లాడు. తిరిగివచ్చే సరికి ద్విచక్ర వాహనం కనిపించలేదు. సీసీ కెమెరా పుటేజీలో చూడగా గుర్తుతెలియని వ్యక్తి వాహనాన్ని తీసుకెళ్లాడు. వెంటనే నర్సయ్య హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ద్విచక్రవాహనంలో ఒరిజినల్ సర్టిఫికెట్లు ఉన్నాయని బాధితుడు పేర్కొన్నాడు. కేసుదర్యాప్తు చేస్తున్నట్లుపోలీసులు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

శంకరపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను శుక్రవారం కేశవపట్నం ఎస్సై శేఖర్‌రెడ్డి బాధితులకు అందజేశారు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా గుర్తించి ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

వేగంగా శిథిలాల తొలగింపు



శిథిలాల తొలగింపు పనులు

వేములవాడ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో కూల్చివేసిన పాతభవనాల శిథిలాల తొలగింపు పనులు వేగవంతమయ్యాయి. దర్శనాలు నిలిపివేశారు. స్వామి వారికి చతుష్కాల పూజలు కొనసాగుతున్నాయి. కూల్చివేతల సందర్భంగా ఏర్పడిన శిథిలాల తొలగింపునకు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు దర్శనాలను నిలిపివేసి ఆలయ ఆవరణ చుట్టూ రేకులతో రక్షణ వలయాన్ని ఏర్పాటు చేశారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



వర్షిత్

కోరుట్ల రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయిలాపూర్ జిల్లాపరిషత్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి ఓరుగంటి వర్షిత్ అండర్14విభాగంలో రాష్ట్రస్థాయి వాలీబాల్‌పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నర్సింహమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడికరీంనగర్‌జిల్లాలోని గర్రెపల్లిలో జరిగిన జిల్లాస్థాయిపోటీల్లో ఓరుగంటి వర్షిత్ జగిత్యాల జిల్లా తరుపునపాల్గొని ప్రతిభక కనబరిచి రాష్ట్రస్థాయిపోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థి వర్షిత్‌ను నర్సింహమూర్తి, పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు.

విదేశాల్లో ఉద్యోగాలకు వారధి టామ్‌కామ్

- నకిలీ ఏజెంట్లకు చెక్
- గల్ఫ్ సహా అనేక దేశాల్లో ఉపాధి అవకాశాలు



చొప్పదండి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉద్యోగాలు చేయాలనుకునే వారికి టామ్‌కామ్ ఒక వారధిగా నిలుస్తున్నది. నకిలీ ఏజెంట్ల ద్వారా విదేశాలకు వెళ్లి నష్టపోయిన బాధితుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం టామ్‌కామ్ (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్)ను తీసుకువచ్చింది. ఏజెంట్లు, దళారుల ప్రమేయం లేకుండా టామ్‌కామ్ పని చేస్తుంది. విద్యార్హతలకు అనుగుణంగా అర్హులైనవారు తమ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నవారికి ఇంటర్వ్యూలు నిర్వహించి విదేశాల్లో ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది టామ్‌కామ్. మధ్యవర్తుల ద్వారా మోసపోకుండా ఈ సంస్థ పనిచేస్తూ యువతకు ఉద్యోగాలను కల్పిస్తున్నది.

● అనేక దేశాలకు...

టామ్‌కామ్ వెబ్‌సైట్ www.tomcom.telangana.gov.in లో దరఖాస్తు చేసుకున్న వారికి గల్ఫ్ సహా అనేక దేశాల్లో ఉపాధి కల్పిస్తుంది. కువైట్, సౌదీ అరేబియా, ఖతార్, బహ్రెయిన్, ఒమన్, యూఏఈతోపాటు జపాన్, జర్మనీ, ఇజ్రాయిల్, పోర్చుగల్, పోలాండ్, అమెరికా లాంటి దేశాలకు టామ్‌కామ్ పంపిస్తుంది. నైపుణ్యం ఉన్నవారిని అవసరమున్న దేశాలకు పంపిస్తుండగా, కొన్ని దేశాల సంస్థలు ఉద్యోగ నియామకాల కోసం టామ్‌కామ్‌ను సంప్రదిస్తున్నాయి. జర్మనీ, జపాన్ దేశాలకు ఎంపికైన వారికి అక్కడి భాషలు నేర్పించి పంపిస్తారు. మిగతా దేశాలకు ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఆంగ్ల భాషలో పరిజ్ఞానాన్ని హైదరాబాద్‌లో అందిస్తారు.

● ఖాళీలను బట్టి ఎంపిక...

టామ్‌కామ్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి వివిధ దేశాల్లో ఖాళీలను బట్టి ఎంపిక చేస్తుంది. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ప్లంబింగ్, ఫార్మా, భవన నిర్మాణరంగం, నర్సింగ్ విభాగాల్లో నైపుణ్యం ఉన్న వారిని ఎంపిక చేస్తుంది. దరఖాస్తు చేసుకున్నవారి అర్హతను బట్టి ఎంపిక చేస్తుంది. జర్మనీ, ఇజ్రాయిల్‌తోపాటు వివిధ దేశాల్లో ఉద్యోగ ఖాళీల కోసం ప్రస్తుతం టామ్‌కామ్ దరఖాస్తులు ఆహ్వానిస్తుంది. ఎంపిక కోసం ఏటీసీ(అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్)ల్లో శిక్షణను ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సర్టిఫికెట్‌ను అందజేస్తుంది. ఈ సర్టిఫికెట్లకు విదేశాలోనూ గుర్తింపు ఉంటుంది.

● దరఖాస్తు ఇలా చేసుకోవాలి..

నైపుణ్యం కలిగినవారు విదేశాల్లో ఉద్యోగం కోసం టామ్‌కామ్ అధికారిక వెబ్‌సైట్ www.tomcom.telangana.gov.in లో దరఖాస్తు చేసుకోవాలి. విదేశాల్లో ఉన్న ఉద్యోగావకాశాలను దరఖాస్తుదారులకు సమాచారాన్ని అందిస్తారు. అర్హతనుబట్టి శిక్షణను ఇచ్చి ఉద్యోగాల్లో నియమిస్తారు. విదేశాల్లో ఎలాంటి మోసాలు, ఏజెంట్లు, మధ్యవర్తులు లేకుండా మంచి ఉద్యోగాలు పొందేందుకు టామ్‌కామ్ మంచి అవకాశాలు కల్పిస్తోంది.

పెన్షనరీ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలి

హుజూరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్స్ పెన్షనరీ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్‌పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్ డిమాండ్‌చేశారు. శుక్రవారం హుజూరాబాద్‌లోని టాప్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 2024నుంచి పదవీ విరమణ పొందిన ఉద్యోగఉపాధ్యాయ పెన్షనర్లలో కొంతమందికి మాత్రమే బెనిఫిట్స్ చెల్లించడం సరి కాదన్నారు. పెన్షనర్స్‌కు రావాల్సిన బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలన్నారు. లేనిపక్షంలో దశలవారీగా పోరాటాలు చేపడతామన్నారు. టాప్ర నాయకులు సమ్మయ్య, వీరస్వామి, వెంకటయ్య, కిష్టయ్య, కనుకయ్య, సాంబయ్య, హరికిషన్, రాజిరెడ్డి, శ్రీహరి, లక్ష్మీనారాయణ, స్వామిరెడ్డి, పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్‌కు 9,454క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శుక్రవారం వరద నీరు స్థిరంగా వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతం నుంచి 9,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటినిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్ భగీరథ, వరదకాలువ, ఇతర ములకు కలిపి ప్రాజెక్టు నుంచి 9,454 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

ఉమ్మడి జిల్లా భగవద్గీత శ్లోక కంఠస్త
పోటీలకు ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానముల, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గీతాజయంతి సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో భగవద్గీత శ్లోక కంఠస్త పోటీలు నిర్వహించనున్నట్లు టీటీడీ ప్రోగ్రామ్స్ కార్య నిర్వాహకుడు కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి, గాయత్రి విద్యానికేతన్‌లో 17న ఉదయం 10 గంటలకు, 18న కరీంనగర్ టీటీడీ కల్యాణమండపంలో ఉదయం 10గంటలకు, 19న రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం బాలరాజుపల్లి జడ్పీ హైస్కూల్‌లో ఉదయం 10గంటలకు, 20న జగిత్యాల జిల్లా కోరుట్ల శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి కల్యాణమండపంలో ఉదయం 10 గంటలకు పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 6వ తరగతి నుంచి ఇంటర్ స్థాయి విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చని, విజేతలకు జ్ఞాపికలు, నగదు బహుమతులు అందిస్తామని తెలిపారు. చదివే అధ్యాయాలు తెలుసుకునేందుకు, పాల్గొనేందుకు, రిజిస్ట్రేషన్ కోసం 7396950725, 9441790725 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రోడ్ల మరమ్మతుకు నిధులు
మంజూరు చేయాలి

చిగురుమామిడి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, చెరువుల మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలని సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి కోరారు. శుక్రవారం మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ధనసరి అనసూయ(సీతక్క)కు లేఖలు రాసినట్లు తెలిపారు. ఈసందర్భంగా విలేకరుతో మాట్లాడారు. 2020,2025లో కురిసిన భారీ వర్షాలకు అనేకగ్రామాల్లో రోడ్లు చెరువులు దెబ్బతిన్నాయన్నారు. మండలంలోని రేకొండ -మొగిళి పాలెం, పెద్దమ్మపల్లిలో బ్రిడ్జిలు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఈ విషయాన్ని సీఎంరేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు.

పాశ్చాత్య సంస్కృతికి స్వస్తి పలకాలి

● హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతీస్వామి



అనుగ్రహభాషణం చేస్తున్న విద్యారణ్య భారతీ స్వామి

ఎల్లారెడ్డిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నేటి యువత పాశ్చాత్య సంస్కృతికి స్వస్తి పలికి హిందూ ధర్మాన్ని పరిరక్షించాలని హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతీ స్వామి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి, రాజన్నపేట గ్రామాల్లోని రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం, పార్వతీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో మహా కుంభాభిషేకం, కాలభైరవస్వామి, సంతాన నాగేంద్రస్వామి ప్రతిష్ఠాపన ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉదయం గణపతి పూజ, ఏకాదశ రుద్రాభిషేకం, కుంకుమ పూజలు నిర్వహించారు. రాచర్లగొల్లపల్లిలో ఎల్లమ్మ ఆలయ నిర్మాణ స్థలాన్ని విద్యారణ్య భారతీస్వామి పరిశీలించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అనుగ్రహభాషణం చేశారు. భారతదేశంలో పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడి హిందూ ధర్మాన్ని మర్చిపోతున్నారన్నారు. చిన్నతనం నుంచే పుట్టిన రోజున ఆధ్యాత్మికత పెంపొందించేందుకు పిల్లలతో భగవద్గీత, రామాయణం, హిందూ ధర్మ పుస్తకాలను అందజేసేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, స్థానికకాంగ్రెస్ నాయకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పిల్లల చదువులపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి

● వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి



మాట్లాడుతున్న వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

సిరిసిల్ల టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి చదువుతున్న పిల్లల విద్యాభ్యాసంపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లాపరిషత్‌బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వఉన్నత పాఠశాలను వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి సందర్శించారు. పాఠశాలతరగతి గదులు, మధ్యాహ్న భోజనశాల, క్రీడామైదానం, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులు ఏర్పాటుచేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం పాఠశాలలో ఉపాధ్యాయులు- తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి సంబంధించి తల్లిదండ్రులకు పలు సూచనలను చేశారు. పదోతరగతి విద్యార్థులకు స్టడీహవర్స్, పరీక్షలకు సిద్ధత,పాఠశాలకు హాజరుశాతం, పిల్లల పరిరక్షణపై తల్లిదండ్రులు దృషిపెట్టాలని సూచించారు. ప్రతి పాఠశాలలో ఐఎఫ్‌బీ ప్యానల్ టీవీలద్వారా కంప్యూటర్‌విద్యను కూడా తప్పనిసరి చేశారన్నారు. అక్టోబరునుంచే పదోతరగతి విద్యార్థులకు స్టడీ హవర్స్‌ను ప్రారంభించామన్నారు. ఆయాపాఠశాలల ప్రధానోపాధ్యాయులు శారద, చకినాల శ్రీనివాస్, ఉపాధ్యాయులతో పాఠశాల విద్యాకార్యకలాపాలపై సమీక్షించారు. బాలలదినోత్సవం సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులను అభినందించారు.

ఎన్‌టీపీసీలో నూతన ఆవిష్కరణలు

● వంద మెగావాట్ల బ్యాటరీ స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణం ● ఎన్టీపీసీ ఆవిర్భావ వేడుకల్లో ఈడీ చందన్ కుమార్ సామంత



కేక్ కట్ చేస్తున్న ఈడీ చందన్ కుమార్, అధికారులు

జ్యోతినగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీ ఆధ్వర్యంలో త్వరలో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టనున్నట్లు ఈడీ చందన్‌కుమార్ సామంత అన్నారు. 48వ ఎన్టీపీసీ ఆవిర్భావ వేడుకల సందర్భంగా ఏటీఎం బిల్డింగ్‌ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ప్రసంగించారు. ఎన్టీపీసీ ప్రాజెక్టు ఆవరణలో త్వరలో వంద మెగావాట్ల బ్యాటరీ స్టోరేజీ నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనివల్ల భవిష్యత్‌లో విద్యుత్ రంగం కీలకం కానున్నదన్నారు. అలాగే కార్బొనేటెడ్ బ్రిక్స్ ప్లాంటును ఎన్టీపీసీలో నిర్మించనున్నట్లు తెలిపారు. 48 ఏళ్లుగా ఎన్టీపీసీ దక్షిణాదికి వెలుగులను అందిస్తోందని, ఇన్నేళ్లు గడిచినా ఇప్పటికీ మిగతా ప్రాజెక్టులకు పోటీగా నిలుస్తుందన్నారు. దేశంలో సౌరవిద్యుత్ స్థాపిత సామర్థ్యం పెరిగిన నేపథ్యంలో థర్మల్‌విద్యుత్ డిమాండ్ తగ్గిందని, రామగుండం ఎన్టీపీసీలో సైతం విద్యుత్ ఉత్పత్తిని కుదించాల్సి వచ్చిందన్నారు. ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ పథకం ద్వారా ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, కలెక్టర్ సహకారంతో ఈప్రాంతంలో మౌళిక వసతుల కల్పన, అభివృద్ధిపనులు చేస్తున్నామన్నారు.

ఘనంగా రేజింగ్ డే వేడుకలు..

రామగుండం ప్రాజెక్టు రేజింగ్‌డే సందర్భంగా శుక్రవారం ఉత్సవాలను నిర్వహించారు. ఏడీఎం బిల్డింగ్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో చందన్ కుమార్ పాల్గొని ఎన్టీపీసీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. పలు పోటీలలో విజేతలకు ఈడీ, ఇతరఅధికారులు బహుమ తులను అందించారు. వివిధవిభాగాల జనరల్‌మేనేజర్లు, హెచ్‌ఓడీలు, ఈజీఎం, హెచ్ఆర్ విజయ్‌కుమార్ సిగ్దర్, సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ శాస్త్రి, ఉద్యోగులు అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా గోదావరి హారతి



గోదావరి నది వద్ద హారతి ఇస్తున్న అర్చకులు, భక్తులు

ధర్మపురి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 24వ రోజు శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం ఆరంభం నుంచి జరిగే కార్యక్రమంలో భాగంగా ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య నదీ మాతకు హారతి ఇచ్చి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

వరదలు, ముంపుపై ప్రజలకు అవగాహన కల్పించాలి

● అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ● సిరిసిల్ల మానేరులో ఎన్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖల మాక్‌డ్రిల్



సిరిసిల్ల మానేరువాగు ఒడ్డున అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందం

సిరిసిల్ల రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వరదలు, ముంపు నివారణ అవగాహనతో సాధ్యమని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అన్నారు. సిరిసిల్ల మానేరు వాగులో శుక్రవారం కమ్యూనిటీ అవేర్‌నెస్‌లో భాగంగా భారత ప్రభుత్వం, హోంశాఖల ఆదేశాల మేరకు ఎన్‌డీఆర్ఎఫ్ బెటాలియన్, సిరిసిల్ల అగ్నిమాపక శాఖల ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించగా ముఖ్యఅతిథిగా అదనపుకలెక్టర్ గడ్డం నగేష్ పాల్గొన్నారు. ఈసందర్భంగా విహార యాత్రలకు వెళ్లే పర్యాటకులు, సరదాగా నది తీరాల్లో విహరించే వారు, ఈతరానివారు నీళ్లలో మునిగిపోయినప్పుడు ప్రాణాలు ఎలా కాపాడుకోవచ్చో వివరించారు. వరదలు సంభవించినప్పుడు, అకస్మాతుగా నీరు పట్టణాలు, గ్రామాల్లోకి వచ్చినప్పుడు అందుబాటులో ఉన్న ఖాళీ బాటిల్స్, క్యాన్స్, థర్మకోల్‌షీట్స్, ప్లాస్టిక్‌బిందెలు, ఎండిన కొబ్బరి బోండాలు మొదలగునవి ఉపయోగించి నీటిలో తెలియాడే పద్ధ తులు తెలియజేశారు. నీటిలో మునిగిపోతున్న వ్యక్తిని ఎలా బయటకు తీయాలో చూపించారు. బయటకు తీసుకువచ్చిన వ్యక్తికి సీపీఆర్, కృత్రిమ శ్వాస ఎలా అందించాలి, నీరు ఎలా బయటకు రప్పించాలో చూపించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఆపద సమయంలో ఎంతో మేలు చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, ఎన్‌డీఆర్ఎఫ్ కమాండెంట్ గౌతం, జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాస్‌రెడ్డి, డీపీవో అఫ్జల్ బేగం, సీపీవో శ్రీనివాసచారీ, జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

వేములవాడలో భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడలో శుక్రవారం భక్తులరద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు భీమేశ్వర ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. భీమేశ్వరాలయంలో అభిషేకం, అన్నపూజ, కల్యాణం తదితర ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో కార్తీక దీపాలను వెలిగించారు.

బద్ది పోచమ్మ ఆలయంలో..

వేములవాడపట్టణంలోని బద్దిపోచమ్మ ఆలయం శుక్రవారం భక్తులతో రద్దీగా మారింది. అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో బోనం సమర్పించారు. భక్తులతో బద్ది పోచమ్మ ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.

జీవితంపై విరక్తి చెంది ఒకరి బలవన్మరణం



హన్మంతు(ఫైల్)

గొల్లపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగదాముని పల్లె గ్రామంలో ఈర్తి హన్మంతు(47) అనేవ్యక్తి తన పంట పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని శుక్రవారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..హన్మంతు కొంత కాలంగా తీవ్రఅనారోగ్యంతో బాధపడుతున్నాడు. జబ్బునయం కోసం పలు ఆసుపత్రుల చుట్టూ తిరిగి లక్షలు వెచ్చించి వైద్య చికిత్సలు చేయించుకున్నప్పటికి రోగం నయం కాలేదు.. దీనికి తోడు అప్పులు చేసి వైద్య చికిత్సలు చేయించుకోవడంతో ఆర్థిక భారం మీద పడింది. ఆరోగ్యం సహకరించడంలేదని..అప్పులెలా తీర్చేది అంటూ తరచుగా మదనపడుతూ ఉండేవాడు. దీంతో జీవితం మీద విరక్తి చెంది ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తన పంట పొలం వద్ద చెట్టుకు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య మల్లవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



శంకర్(ఫైల్)

రుద్రంగి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బిల్డింగ్‌పై నుంచి పడిన వ్యక్తి గాయపడగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గంధం శంకర్(55) బుధవారం తన ఇంటి నిర్మాణంలో భాగంగా గోడలకు నీళ్లు పడుతున్నాడు. ఈ క్రమంలో అదుపుతప్పి మొదటి అంతస్తు నుంచి కిందపడ్డాడు. దీంతో శంకర్ తలకు, నడుముకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శంకర్ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

జేఎన్టీయూలో జాతీయ స్థాయి వర్క్‌షాప్



సర్టిఫికేట్‌లను ప్రదానం చేస్తున్న జేఎన్టీయూ ప్రిన్స్‌పాల్

రామగిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ డిపార్టమెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయస్థాయి వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఫిజిక్స్, కెమిస్ట్రీలో సాంకేతిక అభివృద్ధిపై జరిగిన వర్క్‌షాప్‌ను ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు పరిశోధనలపై ఆసక్తితోపాటు అవగాహన పెంచడానికి వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశామన్నారు. వర్క్‌షాప్ సెమినార్లను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు నూతన పరిశోధనలపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు ప్రయోగాత్మక పరిశోధనలు చేశారు. వైస్ ప్రిన్స్‌పాల్ ఉదయ్‌కుమార్, వరంగల్ నిట్ ప్రొఫెసర్స్ లక్ష్మారెడ్డి, హరనాథ్, కన్వీనర్లు శంకర్, మహేందర్, రాజేశ్ కుమార్, స్టూడెంట్ కో-ఆర్డినేటర్లు రాంతేజ, శ్రీజ,నవ్య, ప్రణీత్, వర్షిత, మమత, సమీద్, తేజ, కరీంనగర్, వాగేశ్వరీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు ఎంజేపీ విద్యార్థుల ఎంపిక



జ్ఞాపికతో విద్యార్థులు, ప్రిన్సిపాల్ వీరప్రభాకర్, అధ్యాపకులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిభాపూలే డిగ్రీ, జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు ఎంపిక య్యారని ప్రిన్సిపాల్ వీరప్రభాకర్ శుక్రవారం తెలిపారు. ఈనెల11 నుంచి 13వరకు సుల్తానాబాద్‌లో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థులు సత్తా చాటారని పేర్కొన్నారు. కబడ్డీ పోటీలో విద్యార్థులు రాణించి జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారని చెప్పారు. చెస్‌లో అఖిల్ రెండో స్థానం, 800 మీటర్ల పరుగు పందెంలో గిరి బంగారు పతకం, వివేక్ కాంస్య పతకం, 400 మీటర్ల పరుగు పందెంలో వంశీ బంగారు, 1500 మీటర్ల పరుగు పందెంలో వివేక్ కాంస్య, డిస్కస్‌త్రో, షాట్‌పుట్ విభాగాల్లో సాకేత్ కాంస్య, వెండి పతకాలను సాధించారని పేర్కొన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పీడీ హన్మంతరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాపాలనకు పట్టం కట్టిన జూబ్లీహిల్స్ ప్రజలు

- సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ - ఉప ఎన్నికలో గెలుపుపై జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకుల సంబరాలు





వెల్గటూర్‌లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు స్వీట్లు తినిపిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, జగిత్యాలలో సంబరాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వెల్గటూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనకు ఉపఎన్నికలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలు పట్టం కట్టారని సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితాలు వెలువడిన తరువాత వెల్గటూర్‌లో స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గోల్ల తిరుపతి, మెరుగు మురళిగౌడ్, శ్రీకాంత్‌రావు, సందీప్ రెడ్డి, బందెల ఉదయ్, పూదరి రమేష్, గుమ్ముల వెంకటేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి టౌన్: పట్టణంలో జరిగిన వేడుకల్లో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం, మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు యమ రాజయ్య, షాకీర్, కొమిరెడ్డి లింగారెడ్డి, పూదరి నర్సాగౌడ్, సేవాదల్ జిల్లా అధ్యక్షుడు నాయిని సురేష్, యూత్ కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు జెట్టి లక్ష్మణ్, పుల్లూరి వెంకటేష్ పాల్గొన్నారు.

కథలాపూర్: మండల కేంద్రంలో జరిగిన వేడుకల్లో ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి రాధాకృష్ణ, భైర దేవ్, సత్యనారాయణ, లింగారావు పాల్గొన్నారు.

పెగడపల్లి: మండల కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, నాయకులు తిరుపతి, సత్తిరెడ్డి, కిషన్, సంజీవ్, కృష్ణహరి, భాస్కర్, వంశీదర్ రావు, పాల్గొన్నారు.

ధర్మపురి: పట్టణంలో జరిగిన వేడుకల్లో టీపీసీసీ సభ్యుడు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చీపిరిశెట్టి రాజేష్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుంట సుధాకర్, ఏఎంసీ వైస్‌చైర్మన్ సంగ నర్సింహులు పాల్గొన్నారు.

మల్యాల: మల్యాలలో కాంగ్రెస్ నాయకులు టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు.

గొల్లపల్లి: మండల కేంద్రంలో జరిగిన సంబరాల్లో ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, మాజీ ప్రజా ప్రతినిధులు చిర్ర గంగాధర్, రేవెళ్ల సత్యానారాయణ, వెంకటేష్‌గౌడ్, యూత్ అధ్యక్షుడు పురంశెట్టి గౌతమ్ రాజు, నాయకులు పాల్గొన్నారు.

జగిత్యాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ నుంచి తహసీల్ చౌరస్తా వరకు పార్టీ నాయకులు ర్యాలీ నిర్వహించి మిఠాయిలు పంపిణీ చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్, నాయకులు మన్సూర్, ఎలిగేటి నర్సయ్య, గాజుల రాజెందర్, కండ్లపెల్లి దుర్గయ్య, నక్క జీవన్, ముజీబ్, రాగుల ప్రదీప్, గుండా మధు పాల్గొన్నారు.

● జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అనుచరులు సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, అడువాల లక్ష్మణ్, బద్దం జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలో జరిగిన వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాయణగౌడ్, నాయకులు అజయ్‌గౌడ్, స్వామి, చంద్రమొహన్‌రెడ్డి, ప్రసాద్, గంగన్న, సంతోష్, అంజయ్య, వినోద్‌రెడ్డి, రాజేష్, రాజేశ్వర్‌రెడ్డి, ప్రవీణ్ ఉన్నారు.

రాయికల్: పట్టణంలో నిర్వహించిన వేడుకల్లో పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్, ప్రధాన కార్యదర్శి మహేందర్ గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ దాసరి గంగాధర్ పాల్గొన్నారు. ఇటిక్యాలలో నాయకులు సంబరాలు నిర్వహించారు.



కోరుట్లలో..

మల్లాపూర్: మండల కేంద్రంతోపాటు మొగిలిపేట తదితర గ్రామాల్లో జరిగిన వేడుకల్లో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ జలపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఆధ్వర్యంలో విజయోత్సవాలను నిర్వహించారు.

కోరుట్ల రూరల్: పట్టణంలోని మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి టపాసులను పేల్చి సంబరాలు జరిపారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

మల్లాపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి రేవంత్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో కలిసి మండలంలోని పాతదామ్‌రాజ్‌పల్లి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని నర్సరీ, పల్లె ప్రకృతివనం, వైకుంఠ ధామం, అంగన్‌వాడీ కేంద్రంను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామ పంచాయతీలోని రికార్డులను పరిశీలించారు. డీఎల్పీవో సుదర్శన్, ఎంపీవో జగదీష్, పంచాయతీ కార్యదర్శి రమేశ్ ఉన్నారు.

ధాన్యం వెంటనే తూకం వేయాలి

కొడిమ్యాల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసి వెంటనే తూకం వేయాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్ శుక్రవారం సూచించారు. మండలంలోని రామకిష్టాపూర్, చెప్యాల తిప్పయ్యపల్లి, చింతల్లపల్లి, మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ పరిశీలించారు.

మెగా జాబ్ మేళా విజయవంతం

జగిత్యాల అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా విజయవంతం అయినట్లు ప్రముఖ మొబైల్ ఫోన్ విడిభాగాల తయారీ కంపెనీ బ్లూ ఓషన్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. నిరుద్యోగ మహిళల కోసం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాలో వెయ్యి మంది అభ్యర్థులు పాల్గొనగా 350 మంది ఫాక్స్‌కాన్ కంపెనీలో ఉద్యోగాలు పొందినట్లు వారు తెలిపారు. కార్యక్రమంల ఫాక్స్‌కాన్ కంపెనీ ఆఫీస్ ఇన్‌చార్జి వీర మహేష్ కుమార్, కో ఆర్డినేటర్ సదాశివరెడ్డి, రాయికల్ మున్సిపల్ మాజీ చైర్మన్ మోర హన్మండ్లు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గన్నె రాజిరెడ్డి పాక్స్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు: ఎస్పీ

కోరుట్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు అవసరమని ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. పట్టణంలోని వివిధ ప్రదాన కూడలీలో 123 సీసీ కెమెరాలను పోలీసులు ఏర్పాటు చేయగా పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంను మెట్‌పల్లి డీఎస్పీ ఎ రాములుతో కలిసి ఎస్పీ అశోక్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో చోరీలు, గొడవలు, రోడ్డు ప్రమాదాల వంటి ఘటనల్లో నిందితుల కదలికలను గమనించి కేసులను త్వరగా చేదించవచ్చన్నారు. కోరుట్ల పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకారం అందించిన వ్యాపార వాణిజ్య సంస్థ సభ్యులను ఎస్పీ అభినందించారు. అంతకు ముందు ఎస్పీకి కోరుట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ బాబు, ఎస్ఐ చిరంజీవి, రామచంద్రుడు పుష్పగుచ్చం ఇచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో పాటు పట్టణంలోని వ్యాపార వాణిజ్య సంస్థల సభ్యులు పాల్గొన్నారు.



మెట్‌పల్లిలో పోలీస్ అధికారులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు

మెట్‌పల్లి టౌన్: డివిజన్ పరిధిలో శాంతి భద్రతాల పరిరక్షణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్పీ అశోక్‌కుమార్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మెట్‌పల్లి సబ్‌డివిజన్ పోలీస్ కార్యాలయాన్ని ఎస్పీ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డ్సును, పరిసరాలను తనిఖీ చేశారు. డీఎస్పీ కార్యాలయానికి సంబంధించిన ఇన్ఫర్మేషన్ బుక్, క్రైం రికార్డు, రిజిస్టర్‌లను పరిశీలించారు. సబ్ డివిజన్ పరిధిలోని రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. గంజాయి రవాణా, విక్రయించే వారిపై నిగా ఏర్పాటు చేసి తరచూ తనిఖీలు నిర్వహించి గంజాయిని సమూలంగా రూపుమాపేందుకు చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మెట్‌పల్లి డీఎస్పీ రాములు, డీసీఆర్‌బీ ఇనస్పెక్టర్ శ్రీనివాస్, మెట్‌పల్లి, కోరుట్ల సీఐలు అనిల్‌కుమార్, సురేష్ బాబు, ఎస్సైలు కిరణ్ కుమార్, అనిల్, రాజు, చిరంజీవి, శ్రీధర్‌రెడ్డి, నవీన్, రామచంద్రం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మృతదేహాన్ని తెప్పించేలా చర్యలు తీసుకోండి

ధర్మపురి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని నేరెళ్లకు చెందిన గుర్రం సురేష్ ఉపాధి కోసం ఇరాక్ వెళ్లి ఓ కంపెనీలో పనిచేస్తుండగా ఈ సంవత్సరం సెప్టెంబరు 3న ప్రమాదవశాత్తు మరణించాడు. మృతదేహం ఇంకా రాకపోవడంతో త్వరగా వచ్చేలా చర్యలు తీసుకోవడంతోపాటు అక్కడి కంపెనీ నుంచి సరైన నష్టపరిహారం అందేవిధంగా చూడాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ధర్మపురి మండల అధికార ప్రతినిధి, న్యాయవాది జాజాల రమేష్ బాధితుడి భార్య సమతతో కలిసి రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. రాష్ట్ర ప్రభుత్వ ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ, వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి బాధిత కుటుంబం నుంచి వివరాలు తీసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, నేరెళ్ల కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు జ్ఞాన భాండాగారాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాజాగౌడ్

జగిత్యాల టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు జ్ఞాన భాండాగారాలని, విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జి బి రాజగౌడ్ సూచించారు. జగిత్యాల పట్టణంలోని జిల్లా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను అదనపు కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వయోజన విద్య ఎస్‌వో శ్రీనివాస్, ఉపాధ్యాయులు జమున, తరంగిణి, సరోజిని, చందన, ఉద్యోగులు శకుంతల, కె కవిత, ఎ స్వరూప, అనిల్‌కుమార్, రాజు, స్వామి, కృష్ణ, విజయ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల అర్బన్: గ్రంథాలయాలు విజ్ఞాన బండగారాలని జగిత్యాల పట్టణంలోని శ్రీ కాసుగంటి నారాయణరావు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అరిగెల అశోక్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పుస్తకం మంచి గురువని, గ్రంథాలయం విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, జ్ఞానం పెంపొందించుకోవడంలో ముఖ్య భూమిక పోషిస్తుందని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ విభాగ అధిపతి కొక్కుల సురేందర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ పి రాజు, డాక్టర్ జివి ఆర్ సాయి మధుకర్, అంకం గోవర్ధన్, కందుకూరి శ్రీనివాస్, డాక్టర్ మహేష్, ప్రమోద్, స్వరూప, దివ్యరాణి తదితరులు పాల్గొన్నారు.

మధుమేహంపై అప్రమత్తంగా ఉండాలి



రాయికల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ధర్మపురి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మధుమేహ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ సీనియర్ ఫిజిషియన్లు డాక్టర్ బీమనాతి శంకర్, డాక్టర్ పట్నాల చక్రధర్ సూచించారు. ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకొని ధర్మపురి పట్టణంలో ఐఎంఏ జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో మధుమేహ అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకర్, డాక్టర్ చక్రధర్, జనరల్ సర్జన్ గూడూరి హేమంత్, జనరల్ ఫిజిషియన్లు డాక్టర్ వాసాల శ్రీధర్ మాట్లాడుతూ మధుమేహ వ్యాధి పట్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు. మధుమేహ వ్యాధి గురించి అవగాహన కల్పించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. గుండె పోటు, స్ట్రోక్, మూత్ర పిండాల వ్యాధి, దృష్టి, నష్టం వంటి అనేక సమస్యలకు దారి తీస్తుందని అన్నారు. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం అవసరమని తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ నీలారపు శ్రీనివాస్, ఐఎంఏ జగిత్యాల ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ పాము శ్రీనివాస్, ఆర్ఎంపీ, పీఎంపీ అధ్యక్షులు వేముల నరేష్, పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మధుమేహ దినోత్సవ ర్యాలీని నిర్వహించారు. అనంతరం బాలికల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, గెలుపొందినవారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొత్తపల్లి రంజిత్ కుమార్, డయాబెటిక్ జిల్లా కో ఆర్డినేటర్ బత్తిని భూమయ్య, ఎంఈవో రాఘవులు, హెచ్ఎం పొన్నం రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్యాక్స్‌లను కంప్యూటరైజ్ చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ

- జిల్లా సహకార అధికారి సీహెచ్ మనోజ్



జగిత్యాలలో సహకార జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న గాయత్రి బ్యాంక్ అధికారులు, సిబ్బంది

గొల్లపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల(ప్యాక్స్)ను పూర్తిస్థాయిలో కంప్యూటరైజ్ చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ అని జిల్లా సహకార సంఘం అధికారి సీహెచ్ మనోజ్ పేర్కొన్నారు. గొల్లపల్లి సింగిల్‌విండో కార్యాలయంలో అఖిలభారత 72వ సహకార వారోత్సవాలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాలను సంపూర్ణ పారదర్శకత దిశగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కేంద్రప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ ఆర్గనైజేషన్‌ల కింద జిల్లాలో 16 సహకార సంఘాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, సహకార సంఘాల అసిస్టెంట్ రిజిష్టర్లు నాగసంకీర్త్, మహేష్, శ్రీనివాస్, పాక్స్ సిబ్బంది, రామ్‌సుధాకర్ రావు, మధుకర్, స్వరూప, వెంకటేష్, పవన్, శైలజ, రైతులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ రంగంలో డిజిటలైజేషన్ ప్రముఖ పాత్ర

జగిత్యాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బ్యాంకింగ్ రంగంలో డిజిటలైజేషన్ ప్రముఖ పాత్ర పోషిస్తోందని గాయత్రి సహకార అర్బన్ బ్యాంక్ సీఈవో వనమాల శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గాయత్రి బ్యాంకు ప్రధాన కార్యాలయం వద్ద ముఖ్య కార్యనిర్వహణాధికారి వనమాల శ్రీనివాస్ సహకార పతాకాన్ని ఆవిష్కరించినారు. అనంతరం బ్యాంకు సమావేశ మందిరంలో ప్రమోటింగ్ డిజిటలైజేషన్ అనే అంశంపై జరిగిన సమావేశంలో సహకార శాఖ అధికారులు, బ్యాంకు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, ముఖ్య కార్యనిర్వాహణాధికారి వనమాల శ్రీనివాస్, జనరల్ మేనేజర్లు శ్రీలత, బోగ రవీందర్, పి.టి.ఎస్. శ్రీనివాస్, సి.హెచ్. కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంకు ముఖ్య కార్యనిర్వాహణాధికారి వనమాల శ్రీనివాస్ మాట్లాడుతూ బ్యాంక్ అభివృద్ధికి సహకరిస్తున్న కేంద్ర మరియు రాష్ట్ర సహకార మంత్రిత్వ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు పాలకవర్గం, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మపురి: రైతులకు సహకార సంఘాల పక్షాన సేవలు అందించేందుకు కృషిచేస్తున్నట్లు ధర్మపురి సహకార శాఖ అడాప్షన్ ఆఫీసర్ రాము, జైనా పీఏసీఎస్ చైర్మన్ సౌళ్ల నరేష్, తిమ్మాపూర్ పీఏసీఎస్ వైస్‌చైర్మన్ గటికె సత్తయ్య తెలిపారు. మండలంలో సహకార సంఘాల వారోత్సవాలు పురస్కరించుకుని ధర్మపురి, జైనా, తిమ్మాపూర్ పీఏసీఎస్‌ల ఆవరణలో వారు జెండాను ఎగురవేశారు. కార్యక్రమాల్లో వైస్ చైర్మన్లు మూల మోహన్‌రెడ్డి, గటికె సత్తయ్య, సీఈవోలు అయ్యోరు రాజేష్, బలుమూరి సాగర్‌రావు, జింబం ప్రభాకర్ పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యసాయ సహకార సంఘం, పూడూర్ సహకార సంఘంలో సహకార వారోత్సవాలను పురస్కరించుకొని ఆయా సంఘాల చైర్మన్లు మెన్నేని రాజనర్సింగరావు, బండ రవీందర్‌రెడ్డి, సహకార జెండాలను ఆవిష్కరించారు. తిర్మాలాపూర్ సహకార సంఘంలో కార్యదర్శి కుర్షీద్ ఆహ్మద్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో ఉపాధ్యక్షురాలు కవితచంద్రమొహన్‌రెడ్డి, ఆయా సింగిల్ విండోల డైరెక్టర్లు శంకరయ్య, ఆనందం, కార్యదర్శులు గంగాధర్, రాజేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ నారాయణగౌడ్, పాల్గొన్నారు.

మల్యాల: మండలంలోని మల్యాల, పోతారం, నూకపెల్లి, తక్కళ్లపల్లి సింగిల్‌విండోల్లో సహకార వారోత్సవాలను ఆయా సంఘాల చైర్మన్‌లు ప్రారంభించారు. కార్యక్రమాల్లో సీఈవోలు శ్రీనివాస్, గంగా ధర్, అనిల్‌రెడ్డి, మనోజ్ సంఘాల డైరెక్టర్లు పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని అల్లీపూర్, భూపతిపూర్ సహకార సంఘాల ఆధ్వర్యంలో ఆయా సంఘాల వద్ద సహకార పతాకాలను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో సంఘాల అధ్యక్షులు యాదవనేని రాజలింగం, ఏనుగు ముత్యంరెడ్డి, ఉపాధ్యక్షులు దేవయ్య, మల్లయ్య, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

జగిత్యాల అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టర్, జిల్లా వైద్యాధికారికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకుడు వెన్న మహేష్ మట్లాడుతూ ఎన్‌హెచ్ఎం కార్మికులకు రెండు నెలలుగా జీతాలు అందక పోవడంతో కార్మికుల పరిస్థితి దయానీయంగా మారిందన్నారు. ఈ నెల 17వ తేదీన హైదరాబాద్‌లోని ఎన్‌హెచ్ఎం కేంద్ర కార్యాలయం ఎదుట మహా ధర్నా చేపడుతు న్నామని తెలిపారు.

రైతు బజార్‌తో ప్రజలకు ఇక్కట్లు

జగిత్యాల అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైతు బజార్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురాకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని మాజీ కౌన్సిలర్ హనుమండ్ల జయశ్రీ కలెక్టర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. మార్కెట్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. దీంతో రైతులు, వ్యాపారులు మార్కెట్ చుట్టు పక్కల రోడ్డుపై క్రయవిక్రయాలు జరపడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు.

జూనియర్ కళాశాలలపై ఫోకస్

(5వ పేజీ తరువాయి)

అడ్మిషన్స్ వివరాలు, కోచింగ్ తరగతుల నిర్వహణ వంటి వాటిని పరిశీలిస్తున్నారు. ఎంత శాతం సిలబస్ పూర్తి చేశారు..? ఒకవేళ చేయకుంటే కారణాలు ఏమిటీ అన్న వివరాలు సేకరిస్తున్నారు. రోజూ వారీగా యాక్షన్ ప్లాన్ అమలు ఎలా ఉంది.. స్టాఫ్ వివరాలు, డిప్యూటేషన్ ఉద్యోగుల పరిస్థితి, కళాశాలకు కేటాయించిన బడ్జెట్‌ను ఎంతవరకు ఉపయోగించుకున్నారు..? స్పోర్ట్స్ మెటీరియల్ సేకరించారా..? తల్లిదండ్రులతో సమావేశాల నిర్వహణ, షానిటేషన్ యుటిలైజేషన్ సర్టిఫికేట్ పరిస్థితి ఎలా ఉంది, రికార్డుల నిర్వహణ ఎలా ఉంది..? తదితర వివరాలను తనిఖీల్లో పరిశీలిస్తున్నారు. సంబంధిత పత్రాలను సేకరించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

● **పరిశీలించే అంశాలివే..**

కళాశాలల్లో టైం టేబుల్ అమలు, సబ్జెక్టుల వారీగా సిలబస్ ఎంత వరకు చేశారు.. కళాశాలకు వచ్చే విద్యార్థులు, లెక్చరర్ల హాజరు శాతం, కళాశాలలో మౌలిక వసతులు ఉన్నాయా..? లేదా...? అనే అంశాలను పరిశీలిస్తారు. వసతులు లేకుంటే విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారనే వివరాలను సేకరిస్తున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో తీసుకునే చర్యలతో పాటు ఎలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారనే అంశాలపై వాకబు చేస్తున్నారు. కళాశాల పరిధిలో ఏఏ గ్రామాలు నుంచి అడ్మిషన్లు వస్తున్నాయి... మిగితా ప్రాంతాల నుంచి అడ్మిషన్లు రాకపోవడానికి కారణాలను లెక్చరర్లను అడిగి తెలుసుకుంటున్నారు. లెక్చరర్ల బోధనపై సైతం ఆరా తీస్తున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు తనిఖీలు..



- బొప్పరాతి నారాయణ, డీఐఈవో

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో తనిఖీలు చేపడుతున్నాము. జీపీఎస్ ట్రాకింగ్ విధానంలో ఎప్పటికప్పుడు నివేదికలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాము. ప్రస్తుతం జిల్లాలో రాష్ట్రస్థాయి మూడు బృందాలు తనిఖీలు చేస్తున్నాయి. తనిఖీలో గుర్తించి అంశాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో బోర్డుకు పంపుతున్నాము.

ఘనంగా నెహ్రూ జయంతి వేడుకలు

జగిత్యాల అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ చౌరస్తా వద్ద జరిగిన కార్యక్రమంలో నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, గోలి శ్రీనివాస్, బొడ్ల రాజు, లైశెట్టి వెంకన్న, బద్దం జగన్మోహన్ రెడ్డి, దూమాల రాజ్ కుమార్, ఎండి ముజాయిద్, జిలానీ, రజియొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ

రాయికల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపతిపూర్ గ్రామానికి చెందిన ఏనుగు భూమక్క, మోతె భూమారెడ్డి, ఇంద్రాల గంగరాజు, కొమ్ము వెంకట నర్సయ్యలు అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాలను మాజీ మంత్రి జీవన్ రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజరెడ్డి, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గుర్రం మహేందర్ గౌడ్, నాయకులు ఉన్నారు.

కత్తెర పురుగుపై జాగ్రత్తలు తీసుకోవాలి



చింతకుంటలో మొక్కజొన్న పంట పరిశీలిస్తున్న ఏవో యోగిత

కథలాపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మొక్కజొన్న పంటపై కత్తెర పురుగు దాడి చేసే ప్రమాదం పొంచి ఉందని రైతాంగం జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి యోగిత సూచించారు. శుక్రవారం మండలంలోని చింతకుంటలో మొక్కజొన్న పంటను పరిశీలించారు. ప్రస్తుతం చలి తీవ్రత పెరుగుతున్న క్రమంలో కత్తెర పురుగు ఉధృతి అధికంగా కనిపిస్తోందన్నారు. దీని నివారణకుగాను రైతాంగం ఇమామెక్టిన్ బెంజోయెట్ ఎకరానికి 100 గ్రాములు 200 లీటర్లతో కలిపి పిచికారి చేసుకోవాలని అన్నారు. పురుగు పెద్దగా కనిపిస్తే డెలిగేట్ 180 గ్రాములు 200 లీటర్లతో కలిపి పిచికారి చేస్తే నివారించుకోచ్చని చెప్పారు. ఈ సందర్భంగా ఏఈఓ హరీశ్, రైతులు ఉన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలి

రాయికల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలని రాయికల్ మండల ఉద్యాన విస్తరణ అధికారి రాజేష్ అన్నారు. మండలంలోని అల్లీపూర్ రైతు వేదికలో శుక్రవారం ఉద్యాన, వ్యవసాయ, సహకార శాఖ, లోహియా ఎడిబుల్ ఆయిల్స్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్ పామ్ పంటపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ సతీష్, ఉద్యాన విస్తరణ రాజేష్, సహకార సంఘం చైర్మన్ రాజలింగం, వైస్‌చైర్మన్ దేవయ్య, సీఈవో ఉపేందర్ ఉన్నారు.

గంజాయి విక్రయిస్తే చర్యలు

మేడిపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మేడిపల్లి ఎస్సై శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. సిబ్బందితో కలిసి నార్కోటిక్‌డాగ్, బాంబు డిస్పోజల్ టీమ్‌తో కలిసి పాన్‌షాపులు, బస్టాండ్ ఏరియా, టీస్టాల్స్ రద్దీ గల ప్రదేశాల్లో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మత్తుపదార్థాలు, గంజాయి విక్రయించవద్దని ప్రజలకు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడితే 100 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

వెల్గటూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్ట రీత్యా నరేమని సీడీపీవో వాణిశ్రీ అన్నారు. శుక్రవారం ధర్మపురి ప్రాజెక్టు పరిధిలోని వెల్గటూర్ మండలంలో వివిధ గ్రామాల్లో బాల్య వివాహాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఇందులో భాగంగా కుమ్మరపల్లి మోడల్ స్కూల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో బాల్య వివాహాలు చేసుకోవద్దని బాల బాలికలచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వలన జరిగే నష్టాల గురించి వివరించారు. బాల్య వివాహాలు చేసుకుంటే ఎలాంటి శిక్షలు పడతాయో వివరించారు. విలేజ్ లెవెల్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏసీ డిపిఓ మౌనిక సూపర్వైజర్ ఆండాలు, ఎల్సిపిఓ శ్రీ కన్య, కుమార్, ప్రిన్సిపల్ కృష్ణ ప్రసాద్, ఉపాధ్యాయులు, తల్లులు కిశోర బాలికలు, గ్రామ పెద్దలు, అంగన్వాడీ టీచర్లు,ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ మండల అధ్యక్షుడిగా లక్ష్మణ్‌కుమార్

రాయికల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండల బీసీ, ఎస్సీ, ఎస్టీ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడిగా ఒడ్డెలింగాపూర్‌కు చెందిన ఈదుల లక్ష్మణ్ కుమార్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు మానాల కిషన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేష న్లు అమలయ్యే విధంగా బీసీలందరూ కలిసికట్టుగా కృషి చేస్తూ ఎస్సీ, ఎస్టీలు ఐకమత్యంతో ముందుకు వెళ్లాలని తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి సల్లూరి రాజు గౌడ్, జగిత్యాల పట్టణ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీకాంత్ గౌడ్, అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లీష్ స్టడీ మెటీరియల్ పంపిణీ

కథలాపూర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంభీర్‌పూర్ పాఠశాలకు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుడు 10వ తరగతి విద్యార్థుల కోసం స్వయంగా రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. న్యూ రిపోర్ట్, వరల్డ్ పజిల్, డ్రాయింగ్, పోయెమ్స్‌ను మేగజైన్‌లో పొందుపరిచారు. కార్యక్రమంలో హెచ్ఎం సుధాకర్‌రెడ్డి, విద్యార్థులు ఉన్నారు.